# మహేశ్వరంలో సబితారెడ్డి గెలుపు

బడంగ్‌పేట/కందుకూరు/ఆర్కేపురం, డిసెంబర్ 3: మహేశ్వరం నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీతో బీఆర్‌ఎస్ అభ్యర్థి పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి భారీ విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి అందెళ శ్రీరాములు యాదవ్‌పై పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి 26,158 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మహేశ్వరం నియోజకవర్గంలో మొత్తం 5,47,577 ఓట్లు ఉండగా 3,02,762 ఓట్లు.. 55.39 శాతం ఓట్లు పోల్ అయ్యాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థికి 1,25,549 ఓట్లు రాగా బీజేపీ అభ్యర్థికి 99,391 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థికి 70,616 ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి పటోళ్ళ సబితా ఇంద్రారెడ్డికి 26,158 ఓట్ల మెజార్టీ వచ్చిన్నట్లు ఎన్నికల అధికారి సూరజ్ కుమార్ ప్రకటించారు. రిటర్నింగ్ అధికారి చేతుల మీదగా బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపు పత్రాన్ని అందుకున్నారు. మూడో రౌండ్, 11వ రౌండ్, 16వ రౌండ్‌లో బీజేపీ అభ్యర్థి అందెళ శ్రీరాములు సల్ప అధిక్యం కనబర్చారు. కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చనగారి లక్ష్మారెడ్డి కౌంటింగ్ మొదలు అయిన్నప్పటి నుంచి మూడో స్థానంతో సరిపెట్టుకున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థికి మూడు రౌండ్లు మినహా అన్ని రౌండ్స్‌లలో మెజార్టీ కొనసాగిస్తూ వచ్చారు. చివరకు 26,158 ఓట్ల మెజార్టీతో విజయ సాధించారు.

### ప్రజలేనా బలం బలగం : సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం నియోజకవర్గం ప్రజలే నా బలం బలగం అని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించడానికి కృషిచేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తనపై పూర్తి విశ్వాసం ఉంచి భారీ ఆధిక్యంతో గెలిపించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఐదోసారి ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు ఎప్పుడు రుణపడి ఉంటానన్నారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదాలు ఎప్పటికి తనతోటి ఉంటాయన్నారు. తన గెలుపు కోసం కృషి చేసిన బీఆర్‌ఎస్ నాయకులకు, ప్రజా ప్రతినిధులకు, బీఆర్‌ఎస్ కార్యకర్తలకు, ఫ్రింట్ అండ్ ఎల్రక్టానిక్ మీడియా ప్రతినిధులకు సబితా ఇంద్రారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

### ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం..

మహేశ్వరం నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా పటోళ్ల సబితా ఇంద్రారెడ్డిని గెలిపించుకుంటామని ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని బడంగ్‌పేట డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ తెలిపారు. బాలాపూర్‌లో ఇబ్రాం శేఖర్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్‌ఎస్ నాయకులు, శ్రేణులు సంబరాలు చేసుకునారు.



ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని కలిసి విజయ కేతనం చూపిస్తున్న పటేల్ సునీతారెడ్డి, చామల శైలజారెడ్డి



సరూర్‌నగర్‌లో సంబరాలు జరుపుకొంటున్న మాజీ కార్పొరేటర్ అనితాదయాకర్‌రెడ్డి



నాదర్‌గుల్‌లో పటాకులు కాలుస్తున్న నాయకులు



అన్నోజిగూడలో పటాకులు కాలుస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

# ఎల్బీ నగర్ విజేత సుధీర్‌రెడ్డి



బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తదితరులు

ఎల్బీనగర్ జోన్‌బృందం, డిసెంబర్ 3: ఎల్బీనగర్ నియోజకవర్గంలో దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విజేతగా నిలిచారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో తొలిసారిగా బీఆర్‌ఎస్ జెండాను ఎగిరింది. ఎల్బీనగర్ నియోజకవర్గం శాసనసభ్యుడిగా బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తన సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డిపై 22,314 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఎల్బీనగర్ అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ఆదివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఉదయం 8గంటలకు ప్రారంభం అయ్యింది. పోస్టల్ బ్యాలెట్లు, పోలైన పురుష ఓటర్లు 149,827, మహిళా ఓటర్లు 1,41,492, ఇతర ఓటర్లు 28 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎల్బీనగర్ ఎన్నికల బరిలో ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్ అభ్యర్థిగా దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా మధుయాష్కీ గౌడ్, బీజేపీ అభ్యర్థిగా సామ రంగారెడ్డిలతో పాటు మరో 45 మంది అభ్యర్థులు బరిలో ఉండగా బీఆర్‌ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విజేతగా నిలిచారు. విజయం సాధించిన దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి 1,11,197 ఓట్లు రాగా, రెండో స్థానంలో నిలిచిన బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డికి 88,883 ఓట్లు, మూడో స్థానంలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీకి 83,157 ఓట్లు వచ్చాయి.

### ప్రజలకు అంకితం : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఇది ఎల్బీనగర్ ప్రజల విజయం. ప్రజలకు ఈ విజయం అంకితం చేస్తున్నా. ఎల్బీనగర్ ప్రజలందరికీ కృతజ్ఞతలు. ప్రతిపక్షాలు అనైతిక కార్యక్రమాలకు పాల్పడ్డా.. కాంగ్రెస్, బీజేపీ ఎల్బీనగర్‌లో ప్రజలకు ఏం చేస్తామో ఒక్కరోజు కూడా చెప్పలేదు. కేవలం వ్యక్తిగత నిందారోపణలు అనైతిక కార్యక్రమాలు, అసత్యప్రచారాలతో నాపై బుదరజల్లే పనుల్లోనే ఉండటంతో వారికి ప్రజలు గుణపాఠం చెప్పారు. అనేక సమస్యలను వదిలి కేవలం నాపై వ్యక్తిగత నిందారోపణలు చేయడాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారు. వారు ఏమీ చేయలేరని, చేసేది బీఆర్‌ఎస్ పార్టీ మాత్రమేనని నమ్మకంతో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నన్ను గెలిపించారు. ప్రజల నమ్మకాన్ని వమ్ముకాకుండా ప్రజలకు సేవ చేసి నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలిపే ప్రయత్నం శక్తివంచన లేకుండా చేస్తాం.



ఎల్బీనగర్ నియోజకవర్గంలో విజయం సాధించిన అనంతరం శ్రీకాంతచారి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నాయకులు గండి సన్నీ యాదవ్, భాస్కర్ సాగర్ తదితరులు

### శ్రేణుల సంబురాలు..

ఎల్బీనగర్ నియోజకవర్గంలో దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విజయం సాధించడం పట్ల పార్టీ శ్రేణులు భారీగా సంబురాలు చేసుకున్నారు. పదకొండు డివిజన్లలో పార్టీ శ్రేణులు పటాకులు కాల్చి సంబురాలు చేసుకోవడంతో పాటు సాగర్ రింగ్‌రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో పార్టీ శ్రేణులతో కలిసి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సంబురాల్లో పాల్గొన్నారు. సుధీర్‌రెడ్డి గెలుపును హర్షిస్తూ డివిజన్ల వారీగా సంబురాలు, ర్యాలీలు నిర్వహించారు. సుధీర్‌రెడ్డి సతీమణి పార్టీ శ్రేణులతో కలిసి తమ నివాసం వద్ద సంబురాల్లో పాల్గొనగా, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి గెలుపు అనంతరం తెలంగాణ కోసం అసువులు బాసిన శ్రీకాంతాచారి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి సంబురాల్లో పాల్గొన్నారు.



ఎల్బీనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ పటాకులు కాలుస్తున్న జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సతీమణి దేవిరెడ్డి కమలారెడ్డి, పార్టీ శ్రేణులు



ఎమ్మెల్యేగా గెలిచిన దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మన్సూరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు కొసనం ధనలక్ష్మి, తదితరరలు